# ప్రజాపక్షం

## జిల్లా అనుబంధం

నల్లగొండ సూర్యాపేట యాదాద్రి

ఆదివారం | 03 మే , 2026 | పేజీలు : 05





వివరాలు మెయిన్‌లో

కార్మికుల ప్రాణాలను బలిగొంటున్న పరిశ్రమలు మూసివేయాలి

# నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యం

### మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

### నల్లగొండలో మెగా జాబ్ మేళా ప్రారంభం




**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** నిరుద్యోగ యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు.న్యాక్‌లో మెగా జాబ్ మేళా ప్రారంభంప్రజాపాలప్రగతి ప్రణాళికలో భాగంగా శనివారం జిల్లా కేంద్రంలోని న్యాక్‌లో నిర్వహించిన మెగా జాబ్ మేళాను మంత్రి ప్రారంభించారు.నిరుద్యోగ యువత ఎలాంటి ఉద్యోగం వచ్చినా ముందుగా చేరాలని, అనవసరంగా సమయం వృధా చేసుకోవద్దని ,ఉద్యోగం చేస్తూ ఉన్నత ఉద్యోగాల కోసం చదువుకోవాలని, ప్రత్యేకించి గ్రూపు ఇతర ఉద్యోగాలకు చదువుకోవాలని తెలిపారు.కేంద్ర ప్రభుత్వం ద్వారా ఎంఎస్ ఎం ఈ కింద పరిశ్రమలు స్థాపించేందుకు అవకాశం ఉందని,దీని ద్వారా కూడా స్వయం ఉపాధి పొందవచ్చని అన్నారు. గతంలో తన హయాంలో నిర్వహించిన జాబ్ మేళా ద్వారా 18,400 మందికి ఉద్యోగాలు ఇచ్చినట్లు ఆయన గుర్తు చేశారు. ఈ మేళా ద్వారా 5,000 మందికి ఉద్యోగాలు ఇచ్చి అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఇవ్వాలని 124 కంపెనీలను కోరారు. యువత స్పందన దృష్ట్యా ఆదివారం కూడా జాబ్ మేళా కొనసాగించాలని కలెక్టర్‌ను ఆదేశించారు. స్థానికులకు ఉపాధి కల్పించాలి నల్లగొండ జిల్లాలో సిమెంట్,రైస్ ఇండస్ట్రీస్,ఫార్మా వంటి అనేక కంపెనీలు ఉన్నాయని,స్థానికులకు ఉపాధి కల్పించాల్సిన బాధ్యత యంత్రాంగంతో పాటు కంపెనీలపై ఉందని మంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి,జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్,జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవర్,డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ డైరెక్టర్ రాజేందర్‌రెడ్డి,స్థానిక సంస్థల ఇంచార్జ్ కలెక్టర్ వై.అశోక్ రెడ్డి డిప్యూటీ మేయర్ అష్రాఫ్ అలీ,మార్కెట్ కమిటీ చైర్మన్ జూకురి రమేష్ ,జిల్లా క్రీడలు, యువజన సర్వీసులు అభివృద్ధిలో శాఖ అధికారి అక్బర్ ఆలీ, పరిశ్రమల శాఖ జిఎం సతీష్ పాల్గొన్నారు.



## ప్రజల భవిష్యత్తుకు మార్గదర్శకం ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక

### ప్రభుత్వ విప్ నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

**ప్రజాపక్షం/నకిరేకల్ :** తెలంగాణ ప్రజల భవిష్యత్తుకు మార్గదర్శకంగా నిలిచేలా ప్రజా పాలన ప్రగతి ప్రణాళికను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రూపొందించారని ప్రభుత్వ విప్,నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం పేర్కొన్నారు. శనివారం స్థానిక నారాయణరెడ్డి ఫంక్షన్ హాల్ లో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక నియోజకవర్గ స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు,ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు.ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు జూన్ నెల నుండి అల్పాహారం అందించే కార్యక్రమాన్ని చేపట్టనుందన్నారు. నియోజకవర్గంలో ప్రభుత్వ భూములను ప్రజా ప్రతినిధులు, అధికారులు కాపాడాలన్నారు. ప్రభుత్వం నుండి ఏ ప్రాజెక్టు తీసుకొచ్చిన భూమి అవసరమని పేర్కొన్నారు. ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా రక్షించుకోవాలని సూచించారు.ఈకార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈఓ ప్రేమ్ కరణ్ రెడ్డి,నకిరేకల్,చిట్యాల మున్సిపల్ చైర్మన్లు చెవుగోని రజిత శ్రీనివాస్ గౌడ్,పందిరి గీత రమేష్,మార్కెట్ కమిటీ చైర్మన్ గుత్తా మంజుల మాధవ రెడ్డి,నియోజకవర్గ అధికారులు పాల్గొన్నారు.

## ఫీల్డ్ అసిస్టెంట్‌ల సమస్యలు పరిష్కారానికి కృషి

### పభుత్వ విప్ బీర్ల ఐలయ్య

**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కీలక పాత్ర పోషిస్తున్నటువంటి ఫీల్డ్ అసిస్టెంట్‌ల సమస్యలు ముఖ్యమంత్రి ఎనముల రేవంత్ రెడ్డి, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క)లతో మాట్లాడి పరిష్కరించేందుకు కృషి చేస్తానని ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అన్నారు. ఆయన యాదగిరిగుట్ట మహాలక్ష్మి ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన ఫీల్ అసిస్టెంట్లు ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో అనేక సంక్షేమ పథకాలు అమలులో ప్రదాన భూమిక పోషిస్తూ ఫీల్ అసిస్టెంట్లు గ్రామ స్థాయిలో చాలీచాలని వేతనాలతో అనేక అవస్థలు పడుతున్నా రని గత నెలలో జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో చర్చించానని, త్వరలో ముఖ్యమంత్రి పంచాయతీరాజ్ శాఖ మంత్రి లతో మాట్లాడి ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కల్పిస్తూ,ఉచిత ప్రమాద బీమా, ఇందిరమ్మ ఇండ్లు,సెల్ ఫోన్లు, వైకల్యం కలిగిన వారికి పెన్షన్ లాంటి సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తానని అన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం 10 సంవత్సరాలు పరిపాలించి ఫీల్ అసిస్టెంట్లను ఏనాడు పట్టించుకోలేదని అందుకే ఫీల్ అసిస్టెంట్లు గత అసెంబ్లీ ఎన్నికలలో కేసీఆర్ కు తగిన గుణపాఠం చెప్పారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు ఇచ్చే వాటా తగ్గిస్తూ ఉపాధి హామీ పథకాన్ని వి బి రాంజి గా పేరు మారుస్తూ పథకాన్ని నిర్వీర్యం చేస్తూ, పెత్తందారులకు కొమ్ముగాస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో యాదగిరిగుట్ట మాజీ ఎంపీపీ శిర్ర శ్రీశైలం, కాంగ్రెస్ నాయకులు హేమెందర్, కానుగు బాలరాజ్, ఫీల్ అసిస్టెంట్ల రాష్ట్ర అధ్యక్షులు బొలుగూరి రవి, ప్రధాన కార్యదర్శి కంకాల సిద్దిరాజ్, యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు బబ్బూరి శంకర్ పాల్గొన్నారు.




## వంట కార్మికులకు నెలకు రూ. 10వేల వేతనం

### ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఎండీ ఇమ్రాన్ డిమాండ్..




**ప్రజాపక్షం/భువనగిరి:** మధ్యాహ్న భోజన వంట కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించిన విధంగా నెలకు 10వేల వేతనం వెంటనే ఇవ్వాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎండీ ఇమ్రాన్ డిమాండ్ చేశారు. శనివారం మధ్యాహ్న భోజన వంట కార్మికుల జిల్లా స్థాయి సమావేశం బాగుల వసంత అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ఇమ్రాన్ ముఖ్యఅతిధిగా హాజరై మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా వంట కార్మికులుగా గత 23 సంవత్సరాలుగా పనిచేస్తున్నారని, వీరికి సరైన జీతాలు గాని ఇతర సౌకర్యాలు ఏమి కల్పించకుండా ప్రభుత్వము శ్రమ దోపిడీ చేస్తున్నాదని, రాష్ట్ర ప్రభుత్వం సెంట్రలైజ్డ్ కిచెన్ పేరుతో అక్షయపాత్ర వారికి అప్పచెప్పే ఆలోచనను వెంటనే విరమించుకోవాలని, రాష్ట్రంలో 54,200 మంది వంట కార్మికులుగా పనిచేస్తున్నారని, ఈ పథకాన్ని సెంట్రలైజ్డ్ కిచెన్ అక్షయపాత్రకు అప్పచెపితే వీరి ఉపాధి పోయే ప్రమాదము ఉన్నది కావున ప్రభుత్వము సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ఎప్పటికప్పుడు పిల్లలకు వేడివేడి భోజనం అందించాలని చెప్పినా, ప్రభుత్వం పట్టించుకోకుండా కార్మికుల పొట్టలు కొట్టే విధంగా ప్రైవేట్ వాళ్లకు ఇవ్వడానికి ప్రయత్నం చేస్తున్నారని అయన ఆరోపించారు. వెంటనే ప్రభుత్వము స్పందించి కార్మికుల యొక్క హక్కులను కాపాడాలని ఈఎస్ఐ పీఎఫ్ సౌకర్యం కల్పించాలని మేనిఫెస్టో పెట్టిన విధంగా పదివేల రూపాయలు ఇవ్వాలని ప్రతి నెల 5వ తేదీ లోపల బిల్లులు జీతాలు ఇవ్వాలని, అందరికీ పని భద్రత కల్పించాలని, కోడిగుడ్లు వంట సామాను ప్రభుత్వ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. జూన్ 5 6 తేదీల్లో హైదరాబాద్లో జరిగే 2వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఈ సందర్భంగా ఇమ్రాన్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా కార్యవర్గ సభ్యులు సామల శోభన్ బాబు, మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు బాగుల వసంత, జిల్లా ప్రధాన కార్యదర్శి ముంతాజ్ బేగం, బీరకాయల లక్ష్మి , సామల పద్మ, ఉట్ల కృష్ణ, కవిత, బుచ్చమ్మ, నర్మల, వాణి, కృష్ణవేణి, అండాలు, జయమ్మ, రాణి తదితరులు పాల్గొన్నారు.

## టెక్ హోమ్ రేషన్ పంపిణీ

ప్రజాపక్షం/నడిగూడెం: మండలంలోని సిరిపురం అంగన్‌వాడీ కేంద్రం3లో శనివారం అంగన్‌వాడీ టీచర్ శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. అనంతరం వేసవి సెలవుల దృష్ట్యా గర్భిణీలు, బాలింతలు, పిల్లలకు టెక్ హోమ్ రేషన్ (టిహెచ్‌ఆర్ ఇంటికి తీసుకవెళ్లే రేషన్)ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వి.రామారావు, ఉప సర్పంచ్ కె. రమేష్, ఆశా వర్కర్లు అరుణ, హెల్పర్లు పద్మ, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

## పదిలో మండల టాపర్‌ను సన్మానించిన జిల్లా కలెక్టర్



ప్రజాపక్షం/నడిగూడెం: మండలంలోని సిరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇటీవల పదవ తరగతి పరీక్షల్లో బొమ్మిడి మిథిలి 560 మార్కులతో మండల టాపర్‌గా నిలిచింది. ఈ సందర్భంగా శనివారం కోదాడలో జరిగిన ఒక కార్యక్రమంలో బొమ్మిడి మిథిలిని కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ ఉత్తమ ప్రతిభా అవార్డు అందజేసి అభినందించారు. ఆమె తల్లి దండ్రులను శాలువాతో సత్కరించారు. విద్యార్థులు మెరుగైన ఫలితాల కోసం కృషి చేసిన ఉపాధ్యాయులను కలెక్టర్ ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి వనం సత్యనారాయణ, హైస్కూల్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు దర్రా ఉపేందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## భక్తి శ్రద్ధలతో నగర సంకీర్తన



ప్రజాపక్షం/చిట్యాల: నల్లగొండ జిల్లా చిట్యాల పట్టణంలో ఈ నెల 5న హిందూ సమ్మేళన సమితి ఆధ్వర్యంలో చేపట్టే హిందూ సమ్మేళన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సమితి సభ్యులు శనివారం నగర సంకీర్తన కార్యక్రమాన్ని చేపట్టారు. హిందూ సంఘాల ప్రతినిధులు, సభ్యులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనాలని అన్ని వార్డులలో ర్యాలీని నిర్వహించారు. ఇంటింటికి సమ్మేళన విశిష్టతను తెలియజేసే కరపత్రాలను పంపిణీ చేశారు. సమితి గౌరవాధ్యక్షులు కోమటి రెడ్డి నర్సింహ్మారెడ్డి, అధ్యక్ష, కార్యదర్శులు తేరటుపల్లి హన్మంతు, విశ్వ అనంతరెడ్డి, వేణు పాల్గొన్నారు.

## మజ్జిగ పంపిణీ

ప్రజాపక్షం/సూర్యాపేటకలెక్టరేట్: జిల్లా కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానం వద్ద వికాస తరంగిణి ఆధ్వర్యంలో బాటసారులకు మజ్జిగ పంపిణీ చేశారు. వికాస తరంగిణి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుందని వేణుగోపాలచార్యులు తెలిపారు. వేసవి కాలంలో ఎండల తాకిడికి ప్రజలు అల్లాడుతున్నారని పట్టణానికి వచ్చిపోయే ప్రజలకు వికాస తరంగిని సభ్యుల సహకారంతో మధ్యాహ్నం సమయంలో మజ్జిగ వితరణ చేస్తున్నట్లు వేణుగోపాలచార్యులు తెలిపారు. బజ్జూరి కృష్ణయ్య, తాటికొండ మంజుల, గజ్జల రవీందర్, కందగట్ల శ్రీనివాస్, దంతాల నాగరాజు, గుండా శ్రీనివాస్, రమేష్ పాల్గొన్నారు.



## భూమి అమ్ముకోనివ్వండి- లేదా చనిపోవడానికి అవకాశం ఇవ్వండి

### వృద్ధ దంపతుల ఆవేదన.. పురుగుల మందు డబ్బాతో నిరసన



ప్రజాపక్షం/చివ్వెంల: తన భూమిని అమ్ముకోనివ్వండి లేదా చనిపోవడానికి అవకాశం కల్పించండని పురుగుల మందు డబ్బాతో వృద్ధ దంపతులు నిరసన వ్యక్తం చేసిన సంఘటన సూర్యాపేట జిల్లా చివ్వెంల మండల పరిధిలోని అక్కలదేవిగూడెం గ్రామంలో చోటు చేసుకుంది. శనివారం అక్కలదేవిగూడెం గ్రామానికి చెందిన కొంగల రాములు, లచ్చమ్మ దంపతులుపురుగుల మందు డబ్బాను పట్టుకుని నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. బండమీద చందుపట్ల రెవెన్యూ వారిలో 264 సర్వే నెంబర్‌లో తనకు తన కుమారుడి పేరున ఎకరం ఆరు కుంటల భూమి కలదని తెలిపారు. అనారోగ్యాల కారణంగా అప్పుల పాలు కావడంతో భూమిని అమ్ముకుంటుంటే అమరగాని అబ్బులు, కొంగల రామలింగయ్య (ప్రభుత్వ ఉపాధ్యాయుడు) మరికొంత మంది వ్యక్తులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని కన్నీంటి పర్యంతమయ్యారు. వారం రోజుల క్రితమే షుగర్ కారణంగా తమ కాలివేలును తీసివేశారని తెలిపారు. హాస్పత్రిలో చూపించుకోవడానికి డబ్బులు లేక ఇంటికి వచ్చినట్లు తన భార్య కూడా పక్షవాతంతో బాధపడుతున్నట్లు రాములు తెలిపారు. తన భూమిని అమ్ముకోనివ్వడంలేదని జిల్లా కలెక్టర తేజస్ నందలాల్‌పవార్ ఏప్రిల్ 6వ తేదీన తన బాధను తెలిపినట్లు తెలిపారు. అదే విధంగా అదే రోజున సూర్యాపేట జిల్లా ఎస్‌పి కె.నర్సింహాని కలిసి సమస్యను తెలియజేసి ప్రాణభయం ఉన్నదని తమకు రక్షణ కల్పించాలని కోరినట్లు తెలిపారు. కాని ఎలాంటి న్యాయం జరగలేదన్నారు. తన తండ్రి దగ్గర నుంచి వారసత్వంగా వస్తున్న భూమిని అమ్ముకోకుండా అడ్డుపడుతున్న వ్యక్తులపైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, లేకపోతే పురుగుల మందు తాగి తన కుటుంబం మొత్తం చనిపోవడమే దిక్కన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడైయుండి డిసెంబర్ నెలలో జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో రాజకీయ నాయకుడిగాకొంగల రామలింగయ్య ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించినట్లు ఫోటోల రూపంలో ఆధారాలను చూపించారు. వారికి కాంగ్రెస్ పార్టీ ఎఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమరెడ్డి అండదండలు ఉన్నాయని మమ్ములను ఎవరు ఏమీ చేయలేరని చెబుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, ఎస్‌పి జోక్యం చేసుకుని తన భూమిని అమ్ముకొని హస్పటల్‌లో చూపించుకోవడానికి అవకాశం కల్పించాలన్నారు. మా ప్రాణాలకు రక్షణ కల్పించాలని కోరారు. మాకు న్యాయం జరగకపోతే మా కుటుంబ సభ్యులందం పురుగుల మందు తాగి చనిపోవడానికి అవకాశం కల్పించాలని కోరారు.

## నేరేడుచర్ల మున్సిపల్ కోఆప్షన్ సభ్యుల ఎన్నిక



కోఆప్షన్ సభ్యులుగా నలుగురు ఏకగ్రీవ ఎన్నిక

ప్రజాపక్షం/నేరేడుచర్ల: నేరేడుచర్ల మున్సిపల్ కార్యాలయంలో శనివారం మున్సిపల్ కమిషనర్ నాగరాజు ఆధ్వర్యంలో మున్సిపల్ కోఆప్షన్ సభ్యుల ఎన్నిక నిర్వహించారు. ప్రత్యేక ప్రజ్ఞానం, పురపాలక శాఖపై అనుభవం కలిగిన విభాగం నుంచి అలక శ్రవణ్‌రెడ్డి, పొనుగోటి శోభ, మైనార్టీ విభాగం నుండి షేక్ ఖాదర్‌ఖాన్, షేక్ మోగలాభి నలుగురు కోఆప్షన్ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జనరల్ మహిళకేటగారిలో పొనుగోటి శోభను 4వ వార్డు కౌన్సిలర్ కొణతం మంజుల ప్రతిపాదించగా 12వ వార్డు కౌన్సిలర్ మహ్మద్ అబ్దుల్ కలీం బలపర్చారు. జనరల్ పురుషుల కేటగిరిలో అలక శ్రవణ్‌రెడ్డి పేరును 6వ వార్డు కౌన్సిలర్, మున్సిపల్ వైస్ చైర్మన్ నూకల సందీప్‌రెడ్డి ప్రతిపాదించగా, 2వ వార్డు కౌన్సిలర్ యారవ లక్ష్మి శ్రీనివాస్ బలపర్చారు. మైనార్టీ జనరల్ మహిళ కేటగిరిలో షేక్ మొబలాభి పేరును 8వ వార్డు కౌన్సిలర్ తాళ్ల లావణ్య ప్రతిపాదించగా, 9వ వార్డు కౌన్సిలర్ ఇంజమూరి శ్రీకాంత్ బలపర్చారు. మైనార్టీ జనరల్ కేటగిరిలో షేక్ ఖాదర్‌ఖాన్ పేరును 13వ వార్డుకౌన్సిలర్ బొలిశెట్టి లక్ష్మయ్య ప్రతిపాదించగా, 5వ వార్డు కౌన్సిలర్ నన్నెపంగు శ్రీనివాస్ బలపర్చారు. ఈ నలుగురిని కోఆప్షన్ సభ్యులుగా 9 మంది కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. నూతనంగా ఎన్నికైన కోఆప్షన్ లను మున్సిపల్ చైర్మన్ కొణతం చిన్న వెంకటరెడ్డి మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన కోఆప్షన్ సభ్యులు పూలమాలలతో, సత్కరించారు. అనంతరం కోఆప్షన్ సభ్యులకు కోఆప్షన్ సభ్యులకు నియామక పత్రాలు అందజేశారు.

## ప్రజలకు ఇబ్బందిగా ఉన్న డివైడర్లను తొలగించాలి

ప్రజాపక్షం/ మిర్యాలగూడ: జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా పట్టణంలో ప్రజలకు ఇబ్బందికరంగా ఏర్పాటు చేసిన డివైడర్లను తొలగించాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం ఆయన పట్టణంలోని డివైడర్లను పరిశీలించి ఆయన మాట్లాడారు. కోదాడ నుంచి జడ్చర్ల హైవే రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా గతంలో ఉన్న డివైడర్లను తొలగించి ప్రజలకు ఇబ్బందికరంగా ఉండే విధంగా డివైడర్లను ఏర్పాటు చేశారన్నారు. రోడ్డుకు ఇటు నుంచి అటుగా వెళ్లేందుకు అనేక యూటర్న్ సెంటర్లు ఉన్నప్పటికీ వాటిని మూసివేశారని అన్నారు. దీని వల్ల పట్టణ ప్రజలు, వాహనదారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. రోడ్డు దాటేందుకు చాలా దూరం వెళ్లాల్సి వస్తుందన్నారు. ముఖ్యంగా అత్యవసర పరిస్థితుల్లో డాక్టర్స్ కాలనీకి వెళ్లాలంటే చాలా దూరం తిరిగి వెళ్లాల్సి వస్తుందని, ఇలాంటి సందర్భంలో కొన్ని సమయాల్లో ప్రాణాలు కోల్పోయే అవకాశం ఉంటుందన్నారు. పట్టణంలో ప్రధాన నాలుగు సెంటర్లలో నిర్మించిన డివైడర్లను తొలగించాలన్నారు. ముఖ్యంగా హనుమాన్‌పేటలోని ఎల్ఐసీ ఆఫీస్ నుంచి సాయిబాబా గుడికి వెళ్లేందుకు ఉన్న సెంటర్‌ను, కూర్పెన్న గాంధీబొమ్మ వద్ద మున్సిపల్ ఆఫీస్‌కు, ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి వెళ్లేందుకు ఉన్న సెంటర్‌ను, శంకుతల థియేటర్ వద్ద చర్చి రోడ్డుకు వెళ్లేందుకు సెంటర్‌ను, టాకా రోడ్డులోని పొట్టి శ్రీరాములు సెంటర్ వద్ద డివైడర్లతో రాకపోకలను మూసివేశారని, వాటిని వెంటనే తొలగించాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్, మల్లు గౌతంరెడ్డి, బావండ్ల పాండు, రెమిడాల పరుశురాములు, తిరుపతి రామ్మూర్తి, పతాని శ్రీనివాస్, క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.



## అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు : కలెక్టర్



ప్రజాపక్షం/తుంగతుర్తి (తిరుమలగిరి): ధాన్యం కొనుగోళ్లలో అక్రమాలను ఎట్టి పరిస్థితుల్లో సహించేది లేదని, అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల పవార్ హెచ్చరించారు. తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్‌లో జరిగిన అక్రమాలపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ నిర్లక్ష్యం వహించిన వారిపై చర్యలకు ఉపక్రమించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించి, దళారులకు సహకరించిన గొట్టిపర్తి ఐకెపి సిసి రామయ్యను సస్పెండ్ చేయగా తుంగతుర్తి తహసిల్దార్ దయానందం, తిరుమలగిరి తహసిల్దార్ హరిప్రసాద్, ఎంపిడిఓ శేషుకుమార్, తుంగతుర్తి మండల వ్యవసాయ అధికారి రమేష్‌బాబు, గొట్టిపర్తి ఐకెపి బిటిఎం జె.శ్వేత, తుంగతుర్తి ఎపిఎం యాదమ్మ లకు షోకాజ్ నోటీసులు జారి చేశారు. అక్రమాలు జరిగిన వెలిశాల, గొట్టిపర్తి, జలాలపురం, మామిడాల ఐకెపి కేంద్రాల ఏజెన్సీలను రద్దు చేసి వేరే ఏజెన్సీలకు కేటాయించడం జరుగుతుందని, డ్రైవర్, కమిషన్ ఏజెంట్ (ట్రేడర్) పై క్రిమినల్ కేసు బుక్ చేయడం జరిగిందని, అలాగే అక్రమాలు జరిగిన ఐకెపి సెంటర్ల మీద కూడా దర్యాప్తు చేసి చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ అన్నారు. తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్‌లో రైతుల నుండి కొనుగోలు చేసి, గొట్టిపర్తి ఐకెపి కేంద్రంలో రైతుల పేరిట విక్రయిస్తున్నారన్న ఆరోపణల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ విచారణకు ఆదేశించగా జిల్లా అధికారులతో కూడిన విచారణ బృందం విచారణ చేపట్టి ప్రాథమిక నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందజేశారు. తుంగతుర్తి మండలంలోని కొన్ని సెంటర్లలో అమ్మకాలు జరిగాయని వాటిపై కూడా అధికారులు విచారణ చేపడతామన్నారు.

## ఘనంగా మేడే ఉత్సవాలు



ప్రజాపక్షం/ మిర్యాలగూడ: మండలంలోని యాద్గార్‌పల్లి గ్రామంలో 140వ మేడే ఉత్సవాలను సీపీఐ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అమెరికాలోని చికాగో నగరంలో పెట్టుబడిదారులు, కార్మికుల మధ్య జరిగిన పోరాటంలో అనేకమంది ప్రాణత్యాగాలు చేసారని అన్నారు. రోజుకు 18గంటలు వెట్టిచాకిరి చేసే కార్మికుల పనిభారాలు తగ్గించాలని పెట్టుబడిదారులకు వ్యతిరేకంగా కార్మికులందరు ముక్తకంఠంతో సమ్మెలో పాల్గొన్నారని ఆ సమ్మెలో అనేకమంది బలిదానమయ్యారని అన్నారు. వెంటనే కేంద్రం రైతు, కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శులు మట్టయ్య, లింగంపల్లి సైదమ్మ, మండల సమితి సభ్యులు ఎస్‌కె.షమీం, సాలజగన్, గువ్వల అంజమ్మ, ప్రమీల, లత, సీనియర్ నాయకులు మర్రి తిరుపతమ్మ, రేణుక, కళావతి, రాములమ్మ, సులోచన, సుశీల, వేణు, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## టీజేఎస్ ప్లీనరీ సమావేశాన్ని విజయవంతం చేయండి



ప్రజాపక్షం/ మిర్యాలగూడ: సామాన్యులకు రాజకీయాల్లో స్థానం కల్పించాలనే లక్ష్యంతో ప్రొఫెసర్ కోదండరాం నాయకత్వంలో స్థాపించబడిన తెలంగాణ జనసమితి పార్టీ 4వ ప్లీనరీ సమావేశాన్ని విజయవంతం చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు పన్నాల గోపాల్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన పట్టణంలోని అమరవీరుల స్థూపం వద్ద ప్లీనరీ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఈనెల 12న హైదరాబాద్‌లోని నెక్లెస్‌రోడ్డులోని జలవిహార్‌లో నిర్వహించే నాలుగవ ప్లీనరీ సమావేశాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో గుండెబోయిన నాగేశ్వర్‌రావు, ఎల్.క్రాంతికుమార్, లచ్చిరాంనాయక్, మంద శ్రీను, ప్రకాష్‌నాయుడు, మురళీయాదవ్, నరేందర్, జయరాజు తదితరులు పాల్గొన్నారు.



## నూతన కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన రామదుర్గారెడ్డి

**ప్రజాపక్షం/దేవరకొండ;** దేవరకొండ మున్సిపాలిటి నూతన కమిషనర్‌గా శనివారం ఎం. రామదుర్గారెడ్డి బాద్యతలు స్వీకరించారు. అనంతరం ఎంఎల్‌ఏ బాలు నాయక్‌ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కమిషనర్‌ను ఎంఎల్‌ఏ పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. దేవరకొండ పట్టణ ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి కృషి చేయాలని ఎంఎల్‌ఏ సూచించారు.

## విద్యార్థినికి ఘన సన్మానం



**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం వెల్మజాల గ్రామంలోని జెడ్పిహెచ్ఎస్ పాఠశాలలో బుధవారం వెలువడిన పదవ తరగతి పరీక్ష ఫలితాలలో విద్యార్థిని యశ శ్రీ ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయిలో ద్వితియ స్థానం, మండల స్థాయిలో ప్రథమ స్థానం సాధించడం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఏఏపిసి చైర్మన్, గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్ గ్రామ సెక్రటరీ, ప్రజా ప్రతినిధులు విద్యార్థినితో పాటు వారి తల్లిదండ్రులను ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఆర్‌డిఓ కార్యాలయంలో ప్రతి సోమవారం ప్రజావాణి

**ప్రజాపక్షం/దేవరకొండ;** రాజస్వ మండలాధికారి కార్యాలయం నందు ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం వరకు డివిజన్ స్థాయి ప్రజావాణి కార్యక్రమం నిర్వహించబడుతుందని, ఈ ప్రజా వాణి కార్యక్రమానికి డివిజన్ స్థాయి అధికారులు హాజరవుతారని ప్రజలు తమ సమస్యలను ప్రజావాణిలో ఆర్జీ చేసుకోవచ్చునని ఆర్డీవో రమణారెడ్డి శనివారం ఒక తెలిపారు.

## దళిత రత్న అవార్డు గ్రహీత అంబటి తులసి

**ప్రజాపక్షం/వేములపల్లి:** మండల కేంద్రానికి చెందిన అంబటి తులసికి దళిత రత్న అవార్డు లభించింది. గురువారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్,డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ జయంతి ఉత్సవాల కమిటీ,మాదిగ దండోరా సంఘాల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఉత్సవాల కమిటీ వైస్ చైర్మన్ మేతరి రోజారాణి, మాజీ మంత్రి డాక్టర్ ఏ.చంద్రశేఖర్,పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ కలిసి ఈ అవార్డును అందజేశారు.ఈసందర్భంగా తులసి మాట్లాడుతూ దళితులందరూ విద్య ద్వారా అభివృద్ధి చెందాలని,ఆర్థికంగా ఎదిగి సమాజానికి దిక్సూచిగా నిలవాలని పిలుపునిచ్చారు.



## ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలే కాకుండా కొత్త పథకాలు



**ప్రజాపక్షం/తుంగతుర్తి:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలే కాకుండా కొత్త పథకాలు ప్రజలకు అందజేస్తుందని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. శనివారం తుంగతుర్తి మండల కేంద్రంలో డిఆర్ పంక్షన్‌హాల్‌లో 99 రోజుల ప్రజాపాలన, ప్రగతి ప్రణాళికలో భాగంగా నియోజకవర్గ స్థాయి అధికారుల సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇప్పటి వరకు గ్రామ, మండల స్థాయిలో కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారలోకి వచ్చినప్పుడు మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, 200 యూనిట్ల విద్యుత్, 500 రూపాయలకే గ్యాస్ వంటి పథకాలు అమలు చేస్తుందన్నారు. దేశంలో ఎక్కడ లేని విధంగా పూర్వ ప్రాథమిక విద్య, ఇంటర్మీడియట్ వరకు ప్రభుత్వ పరంగా మద్యాహ్న భోజనం అందించనున్నది. ఏదైనా ప్రమాదవశాత్తు ఎవరైన మరణిస్తే ఆ కుటుంబాన్ని ఆదుకునేందుకు ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని అమలు చేయనున్నదని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ మండలాల తహసిల్దార్లు, ఎంపిడివోలు, ఆయా శాఖల అధికారులు, మార్కెట్ కమిటి చైర్మన్లు, సర్పంచులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎత్తివేయడానికే జీవోను తీసుకొచ్చారు



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ఫీజు రియంబర్స్‌మెంట్ పథకాన్ని ఎత్తివేయడానికే ప్రభుత్వం జీవో నెం.7ను తీసుకొచ్చిందని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ ఆరోపించారు. శనివారం ఆయన పట్టణంలో జీవో ప్రతులను దగ్ధం చేసి మాట్లాడారు. పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదవడానికి ఫీజు రియంబర్స్‌మెంట్ పథకాన్ని తీసుకొస్తే నేటి కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాన్ని రద్దు చేసేందుకు కుట్ర చేస్తుందన్నారు. గత నాలుగు సంవత్సరాలుగా ఫీజు బకాయిలను విడుదల చేయకపోవడంతో కళాశాలల యాజమాన్యాలు హైకోర్టుకు వెళ్లారని రాష్ట్ర ప్రభుత్వం తరుపున విద్యార్థుల పక్షాల బలమైన వాదనలు వినిపించాల్సిన ప్రభుత్వం ఫీజు రియంబర్స్‌మెంట్ పథకాన్ని దశలవారీగా రద్దు చేసే కుట్రలో భాగంగానే కోర్టుకు సరైన వాదనలు వినిపించలేదని ఆయన అన్నారు. విద్యార్థుల ఖాతాలకే ఫీజుల నిధులు చెల్లిస్తామని చెప్తూ జీవో నెం.7ను విడుదల చేసిందన్నారు. కార్యక్రమంలో బంటు వెంకటేశ్వర్లు, ఎర్రబెల్లి దుర్గయ్య, ఫరూఖ్, ఉరిబండి శ్రీనివాస్‌యాదవ్, ఎస్పీ నాయుడు, బంటు సైదులు, అంజి, రాంబాబుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ‘ఉపాధి’పనులను పరిశీలించిన జడ్పి సిఇఓ శీరిష



**ప్రజాపక్షం/చివ్వెంల:** ఉపాధి హామీ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, ఎండల తీవ్రత ఉన్నందున కూలీలు ఉదయం ఆరు గంటలకు వచ్చి, పది గంటల వరకు పనిచేసి వెళ్లాలని జడ్పి సిఈవో శీరిష అన్నారు. శనివారం మండల కేంద్రంలోని కీతప్ప చెరువులో జరుగుతున్న ఉపాధిహామీ పనులను అకస్మికంగా తనిఖీ చేశారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున కూలీలకు నీట కోసం టెంట్, తాగు నీరు కూల్ క్యాన్ లను ఏర్పాటు చేయాలని, ఎవరికైనా ఎండ వేడిమి వల్ల నీరసంగా ఉంటే లీటర్ నీళ్లలో ఒక ఒఆర్ఎస్ ప్యాకెట్ కలుపుకుని తాగాలని, మెడికల్ కిట్టు అందుబాటులో ఉంచాలని చెప్పారు. కూలీలు రెగ్యూలర్‌గా పనిచేసుని 100 రోజుల పని పూర్తి అయ్యే విధంగా చేసుకుంటే సుమారు ఒక జాబ్‌కార్డుకి 30వేల రూపాయలు వస్తాయని అన్నారు. ఏప్రిల్ 15వ తేదీ వరకు పనిచేసిన వరకు కూలీలకు వేతనాలు విడుదల చేయడం జరిగిందని, మీ బ్యాంకు, పోస్ట్ అకౌంట్లలో జమ అయ్యాయని చెప్పారు. ఈ కార్యక్రమలో ఎపీవో ఇరుగు నాగయ్య, టిఏ విజయ్‌కుమార్, కార్యదర్శి కిరణ్, ఫీల్డ్ అసిస్టెంట్ మల్లేష్, వర్కింగ్ మేట్లు, లక్ష్మి, త్రివేణి పాల్గొన్నారు.

## బెల్ట్ షాపులు నిర్వహిస్తే రూ.25 వేల జరిమాన

### మర్రిగూడ గ్రామపంచాయతీ పాలకవర్గం కీలక నిర్ణయం

**ప్రజాపక్షం/మర్రిగూడ:** మండల కేంద్రంలో అక్రమంగా నిర్వహిస్తున్న బెల్ట్ షాపులను పూర్తిగా నిషేధిస్తూ గ్రామపంచాయతీ పాలకవర్గం కీలక నిర్ణయం తీసుకుంది.శనివారం సర్పంచ్ వీరమల్ల శిరీష లోకేష్ గౌడ్ అధ్యక్షతన జరిగిన గ్రామపంచాయతీ సమావేశంలో బెల్ట్ షాపుల నిర్మూలనపై చర్చించారు. మండల కేంద్రంలో అక్రమంగా నిర్వహిస్తున్న అన్ని బెల్ట్ షాపులను నిషేధించాలని పాలకవర్గం ఏకగ్రీవంగా తీర్మానించింది.గ్రామపంచాయతీ పరిధిలో ఎవరైనా బెల్ట్ షాపులు నిర్వహిస్తే వారికి రూ.25 వేల జరిమానా విధించడంతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ తీర్మానాన్ని ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.గ్రామంలో శాంతిభద్రతలు, కుటుంబాల సంక్షేమం దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు సభ్యులు తెలిపారు.గ్రామ ప్రజలు సహకరించి బెల్ట్ షాపుల నిర్మూలనకు తోడ్పడాలని కోరారు.పంచాయతీ తీసుకున్న ఈ నిర్ణయం పట్ల గ్రామంలోని మహిళలు హర్షం వ్యక్తం చేశారు.సమావేశంలో పాలకవర్గ సభ్యులు,పంచాయతీ కార్యదర్శి యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.






## ఎరువుల దుకాణం ప్రారంభం

**ప్రజాపక్షం/మునుగోడు:** రైసింగ్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో మునుగోడు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఎరువుల దుకాణాన్ని శనివారం ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ప్రారంభించారు.ఎమ్మెల్సీ రిబ్బన్ కట్ చేసి దుకాణాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన ఎరువులతో పాటు విత్తనాలను సకాలంలో అందజేయాలని నిర్వాహకులకు సూచించారు.అనంతరం ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంను శాలువాతో ఘనంగా సన్మానించారు.కార్యక్రమంలో చండూరు మార్కెట్ కమిటీ చైర్మన్ దోటి నారాయణ,కంపెనీ చైర్మన్ నెల్లికంటి రాఘవేంద్ర యాదవ్,వైస్ చైర్మన్ మల్ల యాదయ్య పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి



**ప్రజాపక్షం/అనంతగిరి:** ఉపాధి హామీ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వాయిలసింగారం సర్పంచ్ నందిగామ శ్రీనివాస్ అన్నారు. శనివారం మండల పరిధిలోని వాయిలసింగారం గ్రామంలో ఉపాధి హామీ పథకం మేట్లకు, కూలీలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో అమలు చేస్తున్న ఈ ప థకం ద్వారా ఆర్థిక సంవత్సరంలో ప్రతి కుటుంబానికి 125 రోజుల పని కల్పించే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొల్లు సుబ్బారావు, గడ్డం వీరబాబు, బుర్రా వీరబాబు, చింతకాయల నాగేంద్ర, నేరేళ్ల నర్సయ్య, మేళ్లచెరువు గురవయ్య, గాదె వీరభద్రం, ఉపాధిహామీ కూలీలు పాల్గొన్నారు.

## ఘనంగా లక్ష మల్లెల పూజ



**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** జిల్లా కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం ఉదయం ఘనంగా లక్ష మల్లె పుష్పార్చన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రధాన అర్చకులు నల్లాన్ చక్రవర్తు వేణుగోపాలచార్యులు స్వామి వారిని పట్టు వస్త్రాలతో ఆలంకరించి శ్రీవిష్ణు సహస్రనామాలతో భక్తులందరూ స్వామి వారిని కీర్తించుచుండగా లక్ష మల్లెలతో స్వామి వారిని అర్చనలతో ఆరాధించారు. తదనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేసి అన్న ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం పట్టణంలోని పురవీధులలో గరుడ వాహన సేవ నిర్వహించారు. కోలాటాల బృందాలతో భజన మంగళ వాయిద్యాలతో పట్టణ పురవీధులలో స్వామి వారిని ఘనంగా ఊరేగించారు.

## 7.5 హెచ్‌పి మోటారు మంజూరు

**ప్రజాపక్షం /భువనగిరి :** 22వ వార్డు పరిధిలోని న్యూ రామ్ నగర్లో ఉన్నటువంటి బోరు పలుమార్లు రిపేరు చేపించినప్పటికీ సమస్య తలెత్తడంతో ప్రజలకు నీటి సమస్య ఏర్పడుతుందని ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఎమ్మెల్యే వెంటనే స్పందించి, 7.5 హెచ్‌పి మోటారు మంజూరు చేయమని అధికారులను ఆదేశించడం జరిగింది. శనివారం సుమారు లక్షా 20 వేల రూపాయలతో నూతన 7.5 హెచ్‌పి మోటారు బిగించడం జరిగింది. వేసవిలో నీటి సమస్య తీర్చిన ఎమ్మెల్యేకు, సహకరించిన అధికారులకు వార్డు ప్రజల తరపున కౌన్సిలర్ జాలిగం విఘ్నేష్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. వార్డు ప్రజలు మహేందర్, దేవేందర్, మునిసిపల్ సిబ్బంది కృష్ణ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



## అంబేద్కర్, పూలే విగ్రహ నిర్మాణ కమిటీ ఏర్పాటు

**ప్రజాపక్షం/మోటకొండూర్** : మోటకొండూరు మండలంలోని కదిరేనిగూడెంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మహాత్మా జ్యోతి రావు పూలే విగ్రహాల ప్రతిష్టాపన కోసం గ్రామస్తులు సమావే శమై నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈ కమిటీలో గౌరవాధ్యక్షులుగా జెట్ట లత పరమేశ్వర్ సర్పంచ్, అధ్యక్షులుగా వేముల బాలస్వామి, ఉపాధ్యక్షులుగా రాంపల్లి అమరేందర్, వేముల మీనయ్య, యాదగిరి, ప్రధాన కార్యదర్శిగా తోటకూర మహేందర్, సంయుక్త కార్యదర్శిగా రాంపల్లి సురేందర్, జెట్ట లక్ష్మ ణ్, వేముల వినోద్,పాషం మధు, ప్రచార కార్య దర్శుగా మహేష్, పంది సురేష్,నోముల నర్సిరెడ్డి,వేముల జంగయ్య, సలహాదారులుగా వేముల కృష్ణ రాంపల్లి నరేందర్ జెట్ట నరేందర్ తొండల సత్యనారాయ ణ, వేముల పాండు, సిగ సతీష్ లను ఏకగ్రీవంగా ఎన్నుకు న్నట్లు సర్పంచ్ జెట్ట లత పరమేశ్వర్ తెలిపారు.

## నాగార్జున పాఠశాలకు అవార్డు




**ప్రజాపక్షం/రామన్నపేట** : వైందం కలంగ్, మలేషియాలో గ్లోబల్ ట్రింఫ్ ఫౌండేషన్ మరియు బ్రిక్స్ ఏషియన్‌బిజినెస్ ఆఫ్ కామర్స్ సంయుక్తంగా నిర్వహించిన గ్లోబల్ బిజినెస్ సమ్మిట్2026 లో రామన్నపేట మండల కేంద్రంలోని నాగార్జున పాఠశాల మోస్ట్ ప్రామిసింగ్ స్కూల్ ఆఫ్ ది ఇయర్ అవార్డుకు ఎన్నికై, మలేషియా యూనివర్సిటీ ప్రొఫెసర్ చేతుల మీదుగా నాగార్జున స్కూల్ కరెస్పాండంట్ డాక్టర్ నాగరాజు నకిరేకంటి మరియు ప్రిన్సిపల్ రేఖ బెస్ట్ ప్రిన్సిపల్ ఇన్ స్కూల్ ఎడ్యుకేషన్ అవార్డు అందుకున్నారు. ఈ అవార్డు అందుకున్నందుకు గాను పాఠశాల సిబ్బంది, మిత్రులు అభినందనలు తెలుపుతూ హర్షం వ్యక్తం చేశారు.

## అదనపు కేంద్రాల ద్వారా పింఛన్లు పంపిణీ చేయాలి

**ప్రజాపక్షం/నకిరేకల్** : పట్టణంలో అదనపు కేంద్రాల ద్వారా పింఛన్లు పంపించాలని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య డిమాండ్ చేశారు శనివారం నకిరేకల్ పట్టణంలోని పోస్ట్ ఆఫీస్ వద్ద పింఛన్ల కోసం నిరీక్షిస్తున్న వృద్ధులు,వికలాంగులతో మాట్లాడి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నకిరేకల్ మున్సిపాలిటీలో సుమారు 3వేల మంది పింఛన్ దారులు ఉన్నారని పేర్కొన్నారు.ప్రస్తుతం ఒకే కేందర్రంలో పింఛన్లు పంపిణీ చేయడం వల్ల వృద్ధులు,వికలాంగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన వెంట మునిసిపల్ మాజీ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్ గౌడ్,మాజీ జెడ్పిటిసి తరాల బలరాం, నాయకులు,రావిరాల మల్లయ్య, పెండెం సదానందం, గుర్రం గణేష్,రాచకొండ వెంకన్నఉన్నారు.



# చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

### కలెక్టర్ బి. చంద్రశేఖర్



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** యువత ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలంటే చెడు అలవాట్లు,వ్యసనాలను దూరంగా ఉంచుకోవాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు. శనివారం స్థానిక క్లాక్ టవర్ సెంటర్‌లో ప్రజా పాలనప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణలో భాగంగా,మాదకద్రవ్యాల దుర్వినియోగం నివారణపై అవగాహన కల్పించేందుకు పోలీస్, ఉమెన్ చైల్డ్ సేఫ్టీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి అతిథులుగా జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్,జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ హాజరయ్యారు.జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జీవితంలో ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలంటే చెడు అలవాట్లు, వ్యసనాలను దూరంగా ఉంచుకోవాలని సూచించారు. యువత క్రమశిక్షణ,పట్టుదలతో ముందుకు సాగాలని, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవాటు చేసుకుంటేనే విజయాన్ని సాధించగలరని తెలిపారు.యువత మత్తు పదార్థాలకు నో చెప్పండి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు చేరండి అని సమాజ అభివృద్ధిలో యువత కీలక పాత్ర పోషిస్తారని పేర్కొన్నారు.జిల్లా ఎస్పి మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం వ్యక్తిగత ఆరోగ్యానికే కాకుండా కుటుంబం మరియు సమాజానికి తీవ్ర హానిని కలిగిస్తుందని తెలిపారు.ఎవరైనా డ్రగ్స్ ఆఫర్ చేసినప్పుడు స్పష్టంగా కాదు అని చెప్పాలని,చెడు స్నేహితులను దూరంగా ఉంచుకోవాలని సూచించారు.అనంతరం డ్రగ్స్ వినియోగం పై వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించడం జరిగింది.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పి రమేష్,జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి,నల్లగొండ డిఎస్పి శివరాం రెడ్డి,టూ టౌన్ సిఐ రాఘవ రావు,వన్ టౌన్ సిఐ రాజశేఖర్ రెడ్డి, ట్రాఫిక్ సిఐ మహాలక్ష్మయ్య,ఉమెన్ చైల్డ్ సేఫ్టీ అధికారులు, సిబ్బంది,విద్యార్థులు పాల్గొన్నారు.

# వేగంగా ధాన్యం కొనుగోలు చేయాలి



**ప్రజాపక్షం/భువనగిరి** : బొమ్మాయిపల్లి ఐకెపి కేంద్రంలో సమస్యలు పరిష్కరించి వేగంగా వడ్లు కొనుగోలు చేయాలని సిపిఐ మండల కార్యదర్శి దాసరి లక్ష్మ య్య అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆధ్వర్యంలో బొమ్మాయిపల్లి 11 వ వార్డులోని ఐకెపి వడ్ల కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి అక్కడి పరిస్థితులను తెలుసుకోవడం జరిగింది. ప్రధానంగా ఒకటే కాంటా తో పాటు హమాలీలు ఎక్కువ సంఖ్యలో లేకపోవడంతో మందకోడిగా వడ్లు కొనుగోలు చేస్తున్నారని, రవాణా సౌకర్యం అదనంగా ఒక లారీ అవసరం ఉన్నది రైతులు పండించి ఐకెపి కేంద్రానికి తెచ్చిన వడ్లు ఏ గ్రేడ్ ధాన్యంగా కొనుగోలు చేయడం లేదు బి గ్రేడ్ ధాన్యంగా కొనుగోలు చేస్తునట్లు చెప్పారు. ఐకెపి కేంద్రాలలో వడ్లు కొనుగోలు చేయడంలో ఆలస్యం జరుగుతుందని, అదనంగా కాంటా తో పాటు హమాలీలను ఎక్కువ సంఖ్యలో ఏర్పాటు చేయాలి కోరారు. వెంటనే ఇట్టి కేంద్రాన్ని సంబంధిత అధికారులు సందర్శించి వడ్ల కొనుగోలు కేంద్రాల్లో ఉన్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించడం వల్ల వెంటనే వడ్లు కొనుగోలు చేయగలుగుతారు దీనితో రైతులకు ఇబ్బంది లేకుండా ఉంటుంది. ఈ కార్యక్రమంలో నాయకులు ఏదునూరి శంకర్, రైతులు బండి నీలమ్మ, గజ్జి రమేష్, గంజి నర్సిరెడ్డి, బండి విజయ బండి రాధ చిలుకూరి జయమ్మ పాముల ధనమ్మ పాల్గొన్నారు.

# వికలాంగుల పింఛన్ 6వేలు అమలుచేయాలి




**ప్రజాపక్షం/అడ్డగూడూరు** : వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ఎన్ పి ఆర్ డి ,వనం ఉపేందర్ యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలం చిర్ర గూడూరు, జానకిపురం, చౌల్లరామారం గ్రామాలలో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మే 1 నుండి 10 వరకు రాష్ట్ర వ్యాప్తంగా వికలాంగులు ఎదుర్కుంటున్న సమస్యల పైన సర్వే, చేయాలని , జిల్లాలో అడ్డగూడూరులో సర్వే లో పాల్గొని వారి సమస్యలు తెలుసుకొని మాట్లాడుతున్న ఉపేందర్ గ్రామం లో సదరన్ సర్టిఫికెట్ ఉన్న గత ఐదు సావంత్సరాల నుండి పించన్ కోసం ఎదురు చూస్తున్నారు కొంత మంది ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామలలో కమిటీలు చిర్ర గూడూరు జానకిపురం , చౌల్లరామారం గ్రామాలలో గ్రామ కమిటీలు ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు చిత్తలూరి శ్రీహరి, అడ్డగుదూరు మండలం అధ్యక్షులు దుస్సా వెంకటేశం, చిర్ర గూడూరు గ్రామ అధ్యక్షురాలు శీల శోభ, కార్యదర్శి మాదాని బాలరాజు, కడియం నాగయ్య, ఉపాధ్యక్షులు శీల ఐలమల్లు సహాయ కార్యదర్శి దర్శనాల జానకిపురం గ్రామ అధ్యక్షులు చింత పరశురాములు, కార్యదర్శి బోనాల బాబు, కోశాధికారి బోనాల పద్మ, ఉపాధ్యక్షులు మెతుకు యాదగిరి, సహాయక కార్యదర్శి చింత సావిత్రి, చౌల్లరామారం గ్రామ అధ్యక్షులు సంఘీ మల్లేశం, కార్యదర్శి శ్రీనివాస్, కోశాధికారి నాగిని జయమ్మ, ఉపాధ్యక్షులు బెజిగం చంద్రయ్య, సహాయక కార్యదర్శి మహేష్ పాల్గొన్నారు.

# వేద పాఠశాలలో వేదం నేర్చుకోండి

**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** వేద పాఠశాలలో చేరి వేదం చేర్చుకోవాలని సద్గురు సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ వేద విద్యాలయ నిర్వాహకులు మునావత్ లక్ష్మీ రాం మహారాజ్ అన్నారు. మండల కేంద్రంలోని చింతచెట్టుతండా రోడ్డులో భగవాన్ శ్రీ సత్యసాయి బాబా ఆధ్యాత్మిక ధర్మ క్షేత్రంలో వేద పాఠశాలను నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. హిందువుల పిల్లలకు కులాలకు అతీతంగా వేదం నేర్పిస్తామని ఆయన తెలిపారు. హిందువులు సంస్కృతి సాంప్రదాయాలను భావితరాలకు అదించడంమే తమ లక్ష్యం అని పేర్కొన్నారు. 10 సంవత్సరాల నుండి 20 సంవత్సరముల లోపు ఉన్న పిల్లలకు ఉచితంగా వేద విద్యను నేర్పిస్తామని ఆయన అన్నారు. పూర్తి వివరాలకు,పాఠశాలకు సహాయం చేయదలిచిన దాతలు 9848009593 ఫోన్ నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.



## పట్టు వస్త్రాలంకరణ కార్యక్రమం

**ప్రజాపక్షం/చింతపల్లి** : మండల పరిధిలోని నసర్లపల్లి గ్రామానికి చెందిన కనికటి సునీత బాలు యాదవ్ దంపతుల కుమార్తె, కుమారుడు శివ భార్గవి, భవేష్ శేయాన్స్‌ల నూతన పట్టు వస్త్రాలంకరణ కార్యక్రమం శనివారం మాల్ వెంకటేశ్వర్లు నగర్‌లోని జయ ఫంక్షన్ హాల్లో జరిగింది. ఈ కార్యక్రమానికి సిపిఐ శాసన మండలి సభ్యులు నెల్లికంటి సత్యం హాజరై చిన్నారులను ఆశీర్వాదించారు. ఈ కార్యక్రమంలో ప్రజా నాట్యమండలి జిల్లా కార్యదర్శి చెల్లం పాండురంగారావు, సిపిఐ మర్రిగూడెం మండలం కన్వీనర్ బుర్ర శేఖర్, దాసరి శ్రీనివాస్ సిపిఐ నాయకులు కొణిదల వెంకటయ్య, సన్నాయిల ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## చేపల వేటలో విషాదం



**ప్రజాపక్షం/రామన్నపేట** : పిర్యాది అయిన శేహాద్రి కుమార్ , తన బందువు రాజు ఖిలో ఇద్దరు కలిసి ఒరిస్సా రాష్టం బండిగూడా గ్రామం నుండి రామన్నపేటకు సెంట్రింగ్ పని కోసం 20 రోజుల క్రితం వచ్చినారు. 01.05.2026 రోజు సెలవు దినం కావడంతో ఇద్దరు మరియు పిర్యాది బాబాయి కలిసి దుబ్బాక మీదిగా లచ్చిరెడ్డి గూడెం శివారులో ఉన్న అసిప్ నగర్ కాలువలో మధ్యాహ్నం అందజ 03.30 గంటల సమయంలో చేపలను పట్టడానికి దిగగా రాజు ఖిలో వయస్సు 20 సంవత్సరాలు ప్రమాదవశాత్తు బురదలో మునిగి పోయి చనిపోయినాడని పిర్యాదు రాగా కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ డి నాగరాజు తెలిపారు.

## రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే యూత్ కాంగ్రెస్ లక్ష్యం




**ప్రజాపక్షం/ఆలేరు** : రాహుల్ గాంధీని దేశ ప్రధానిగా చేయడమే తమ ప్రధాన లక్ష్యమని యూత్ కాంగ్రెస్ తెలంగాణ ఇన్‌ఛార్జి భవ్య జి తెలిపారు. శనివారం ఆలేరు పట్టణంలోని ఇందిరా కాంగ్రెస్ భవన్లో నిర్వహించిన యూత్ కాంగ్రెస్ ఎగ్జిక్యూటివ్ సమావేశానికి ఆమె హాజరై ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణలో యూత్ కాంగ్రెస్ను బలోపేతం చేయడానికి కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని, యువతను పార్టీ వైపు ఆకర్షించేందుకు విస్తృత కార్యక్రమాలు చేపడుతున్నామని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో పార్టీ కార్యకలాపాలను గ్రామ స్థాయికి విస్తరించి, యువతను నాయకత్వంలోకి తీసుకురావడం ప్రధాన లక్ష్యమని ఆమె అన్నారు.ఈ కార్యక్రమం లో యూత్ కాంగ్రెస్ ఆలేరు నియోజకవర్గం అధ్యక్షులు మంగ కిరణ్ కుమార్,యాదాద్రి జిల్లా అధ్యక్షులు మంగ ప్రవీణ్, ఆలేరు మండలు అధ్యక్షులు బండపల్లి మహేష్, వలపు రమేష్, శ్రవణ్ రెడ్డి, నర్సి రెడ్డి, సురేష్, పర్శి నరేష్, కోరుటూరి సత్తిష్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ పబ్లిక్ స్కూల్ మంజూరుపై హర్షం

**ప్రజాపక్షం/అడ్డగూడూరు** : అడ్డగూడూరు మండలానికి తెలంగాణ పబ్లిక్ స్కూల్ మంజూరు చేసినందుకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి, తుంగతుర్తి శాసనసభ సభ్యులు మందుల సామేలుకి యాదాద్రి భువనగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ డిసిసి మెంబర్ తుప్పతి స్వప్న బీరప్ప హృదయపూర్వక కృతజ్ఞతలు, ఒ ప్రకటనలో తెలియజేశారు. మా ప్రాంత విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం, విద్యా రంగానికి పెద్దపీట వేస్తూ అడ్డగూడూరుకు అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో కూడిన పాఠశాలను కేటాయించడం హర్షణీయం. దీనివల్ల మండలంలోని పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఎంతగానో మేలు జరుగుతుంది. ఈ ప్రాంతం విద్యాపరంగా అభివృద్ధి చెందుతుంది. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం కాబట్టి అందరికీ మేలు జరుగుతుంది' అని అన్నారు.




## విబిఎస్‌తో చిన్నారులకు జ్ఞానం

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** వేసవిలో వీబీఎస్ ద్వారా పిల్లలకు చదువుతో పాటు మంచి విజ్ఞానాన్ని పెంపొందిస్తుందని పాస్టర్ పి.ఆర్ డేవిడ్ అన్నారు.ఐదు రోజుల పాటు వీబీఎస్ కార్యక్రమంపట్టణంలోని మిర్యాలగూడ రోడ్‌లో గల హౌస్ ఆఫ్ ప్లేయర్ చర్చి ఆధ్వర్యంలో ఐదు రోజుల పాటు చిన్నారులకు వీబీఎస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు పలు అంశాలపై అవగాహన కల్పించి సమ్మర్ క్యాంపును నిర్వహించారు. పలు అంశాలపై వ్యక్తిత్వ వికాస పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఇలాంటి క్యాంపుల ద్వారా మంచి జ్ఞానం పెంపొందుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు, చర్చి సభ్యులు,చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

## కొలనుపాక మురళీధర్ రావుకు ఘన నివాళులు

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** జిల్లాలో ప్రముఖ కవి,కథారచయిత న్యాయవాదిగా విశిష్ట ప్రస్థానం కొనసాగించిన కొలనుపాక మురళీధర్ రావు నిజమైన సాహితీ కృషీవలుడని పలువురు వక్తలు పేర్కొన్నారు.శనివారం సాయంత్రం జిల్లా కేంద్ర గ్రంథాలయం ఆడిటోరియంలో జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సంస్మరణ సభలో మురళీధర్ రావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు మేరెడ్డి యాదగిరి రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సభలో పలువురు వక్తలు మాట్లాడుతూ, మురళీధర్ రావు సాహిత్య రంగానికి చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గాదె వినోద్ రెడ్డి,పున్నమి అంజయ్య,మునాస వెంకట్ కృష్ణ,కౌండిన్య,ఎలికట్టె శంకర్ రావు,బండారు శంకర్, భీమార్జున్ రెడ్డి,పులిజాల నళినీ రంజన్ రావు,కొలనుపాక ఉదయ్ కుమార్,అజయ్ కుమార్ కుటుంబ సభ్యులు సుగుణ,గీత,వినోదిని,శరత్ పాల్గొన్నారు.

## ర్యాంక్ సాధించడం అభినందనీయం



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ఇటీవల విడుదలైన పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో మండలంలోని లావూడితండాకు చెందిన లావూడి కావ్య జిల్లా స్థాయిలో 542 మార్కులు సాధించడం అభినందనీయమని రాష్ట్ర పన్నులశాఖ డిప్యూటీ కమీషనర్ గోవర్ధన్, యాదగిరిగుట్టల తహసీల్దార్ గణేష్‌లు అన్నారు. శనివారం వారు వెంకటాద్రిపాలెంలో విద్యార్థినికి స్వీట్లు తినిపించి అభినందించి మాట్లాడారు. కావ్య భవిష్యత్తులో సైతం మంచి ర్యాంకులు సాధించి ఉన్నత స్థాయికి ఎదగాలని అన్నారు. కార్యక్రమంలో మాలోతు దశరథనాయక్, మాలోతు రజిని, రవి తదితరులు పాల్గొన్నారు.

## దేవకమ్మ చిత్రపటానికి నివాళులు

**ప్రజాపక్షం/నకిరేకల్ :** మండలంలోని మార్రురు గ్రామానికి చెందిన లైన్మెన్ నకిరేకంటి కరుణాకర్ మాతృమూర్తి నకరికంటి దేవకమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. శనివారం దశదినకర్మ సందర్భంగా టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దైద రవీందర్ ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు,కుటుంబ సభ్యులు ఉన్నారు.

# పకడ్బందీగా ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

### ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ వై. అశోక్ రెడ్డి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై. అశోక్ రెడ్డి అధికారులను ఆదేశించారు.ఈనెల 13 నుంచి 21 వరకు పరీక్షలు శనివారం తన ఛాంబర్‌లో అధికారులతో సమావేశమైన ఆయన,మే,జూన్ 2026లో జరిగే సప్లిమెంటరీ పరీక్షలను సక్రమంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు కృషి చేయాలన్నారు.ఈ నెల 13 నుంచి 21వరకు మొదటి సంవత్సరం పరీక్షలు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు,రెండో సంవత్సరం పరీక్షలు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 వరకు జరుగుతాయని తెలిపారు.10,078 మంది విద్యార్థులు,29 పరీక్ష కేంద్రాలు జనరల్ ఫస్టియర్ 4,913 మంది, ఒకేషనల్ ఫస్టియర్ 1,133 మంది,సెకండియర్ జనరల్ 3,414 మంది,ఒకేషనల్ 618 మంది మొత్తం 10,078 మంది విద్యార్థులు హాజరవుతున్నారని,29 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు.సమావేశంలో ఏఎస్‌పి రమేష్,ఇంటర్మీడియట్ జిల్లా అధికారి దస్రు నాయక్, ఆర్టీసీ అధికారి ప్రభాకర్,ప్రిన్సిపాల్స్ శ్రీదేవి,శోభ పాల్గొన్నారు.

# 99 రోజుల కార్యక్రమం విజయవంతం




### దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్

**ప్రజాపక్షం/దేవరకొండ:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా దేవరకొండ నియోజకవర్గ స్థాయి సమీక్షా కార్యక్రమం శనివారం నిర్వహించడం జరిగింది. ఆర్టీవో రమణారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఎల్‌ఏ నేనావత్ బాలునాయక్ పాల్గొన్నారు. వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు నియోజకవర్గంలో గత రెండున్నర సంవత్సరాలలో జరిగిన అభివృద్ధి పనులు, అమలవుతున్న సంక్షేమ పథకాల పురోగతిపై సమగ్ర నివేదికను సమర్పించారు. ఈసందర్భంగా ఎంఎల్‌ఏ బాలునాయక్ మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, రోడ్లు, తాగునీరు, విద్యుత్ సౌకర్యాల కల్పన వేగంగా జరుగుతోందని వివరించారు. అనంతరం గ్రోమోర్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎరువుల ప్రదర్శన స్టాల్‌నుసందర్శించి రైతులకు అందిస్తున్న ఎరువుల నాణ్యత, వినియోగ విధానం గురించి వివరాలు తెలుసుకున్నారు. గిరిజనుల చేతితో తయారు చేసిన వస్తువల ప్రదర్శన స్టాళ్లలను సందర్శించి వారి ఉత్పత్తులను ప్రోత్సహిస్తూ, మార్కెటింగ్ అవకాశాలను పెంచేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈకార్యక్రమంలో ఎంపిడివోలు, తహశీల్దార్లు, వ్యవసాయ, వైద్య, విద్యా, పంచాయతీ రాజ్, ఆర్ అండ్ బి, మిషన్ భగీరథ శాకల అధికారులు పాల్గొన్నారు.

# రైతువారం కార్యక్రమాన్ని జయప్రదం చేయండి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మిర్యాలగూడ వ్యవసాయ, ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో ఈనెల 4 నుంచి నిర్వహించినున్న రైతువారం కార్యక్రమ ప్రారంభోత్సవానికి హాజరు కావాలని మిర్యాలగూడ వ్యవసాయశాఖ ఇన్‌చార్జి అసిస్టెంట్ డైరెక్టర్, ఎంఏవో రుషేంద్రమణి, ఉద్యానవన అధికారి షేక్ నసీమామోహ్రిన్‌లు శనివారం ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ కెతావత్ శంకర్‌నాయక్‌లను కలిసి ఆహ్వానించారు. ఈనెల 4న ఆరోగ్య పరిరక్షణ, సమతుల్య ఎరువుల యాజమాన్యం, ప్రకృతి వ్యవసాయం, 5న ఉద్యానవన పంటల సాగు, ఆయిల్ పామ్ సాగు విస్తరణ పెంపుదల, ప్రత్యామ్నాయ పంటల సాగు, 6న బ్యాంకుల ద్వారా దీర్ఘ, స్వల్పకాలిక రునాలు, సహకార సంఘాలు, ఎఫ్‌పీవోల ద్వారా రైతులకు సేవలు, వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ అవకాశం, 7న వ్యవసాయ క్షేత్రాలు, సౌర విద్యుత్ కేంద్రాలు, పీఎం కుసుమ్, పరిశ్రమ, పశు జాతి అభివృద్ధి, దూడల పరిరక్షణ, గడ్డి విత్తనాలు, వేసవిలో పశు సంరక్షణ, మత్స్యశాఖ చెరువులో కలుపు నివారణ, వ్యాదుల నియంత్రణ, అధికోత్పత్తి చర్యలు, 9న పౌర సరఫరాల శాఖ వినియోగదారులు సన్నరకాల బియ్యం సాగు గురించి వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తారని అన్నారు. రైతులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈవోలు, రైతులు ఉన్నారు.

# సెల్‌ఫోన్ దొంగను అరెస్టు చేసిన రైల్వే పోలీసులు


**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** సికింద్రాబాద్ నుంచి గుంటూరు వైపు వెళ్తున్న ఫాలక్‌నామా ఎక్స్‌ప్రెస్‌లో సెల్‌ఫోన్,నగదు దొంగిలించిన నిందితుడిని రైల్వే పోలీసులు అరెస్టు చేశారు.వివరాల్లోకి వెళ్తే సాయంత్రం సమయంలో పగిడిపల్లి రైల్వే స్టేషన్ క్యాబిన్ సమీపంలో నెమ్మదిగా వెళ్తున్న రైలు జనరల్ కోచ్‌లో ప్రయాణిస్తున్న ఇద్దరు ప్రయాణికుల వద్ద నుంచి పగడాల లక్ష్మీనారాయణ అనే వ్యక్తి ఒక వీవో మొబైల్ ఫోన్,రూ.5వేల నగదు దొంగిలించి రైలు నుంచి దూకి పరారయ్యాడు.అనంతరం ఈనెల 1న సాయంత్రం అదే పగిడిపల్లి రైల్వే స్టేషన్ క్యాబిన్ వద్దకు వచ్చి మరల నేరానికి పాల్పడేందుకు ప్రయత్నిస్తుండగా నల్లగొండ జీఆర్‌పి పోలీసులు,భువనగిరి ఆర్‌పిఎఫ్ సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించి నిందితుడిని పట్టుకున్నారు.అతని వద్ద నుంచి వీవో మొబైల్ ఫోన్‌తో పాటు రూ.1,000 నగదు స్వాధీనం చేసుకున్నారు.అనంతరం నిందితుడిని నల్లగొండ రైల్వే ఎస్‌ఐ బొడిగె రామకృష్ణ న్యాయస్థాన రిమాండ్‌కు తరలించారు.నిందితుడు లక్ష్మీనారాయణ గతంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూడా పలు నేరాలకు పాల్పడి జైలుకు వెళ్లి వచ్చినట్లు పోలీసులు తెలిపారు.

# గణితశాస్త్ర శిక్షణకు ఎన్‌జి కళాశాల విద్యార్థినిలు ఎంపిక

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** గ్రామీణ ప్రాంతాల విద్యార్థినులు అంతర్జాతీయ స్థాయి సంస్థల్లో శిక్షణకు ఎంపిక కావడం గర్వకారణమని ఎన్‌జీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.ఉపేందర్ తెలిపారు. పట్టణంలోని నాగార్జున ప్రభుత్వ కళాశాలకు చెందిన విద్యార్థినులు రాజేశ్వరి, మనీషాలు బెంగళూరులోని ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ థియరీటికల్ సైన్సెస్ ప్రతి ఏడాది నిర్వహించే ప్రతిష్టాత్మక సమ్మర్ స్కూల్ ఫర్ ఉమెన్ ఇన్ మ్యాథమెటిక్స్ అండ్ స్టాటిస్టిక్స్ కార్యక్రమానికి ఎంపికయ్యారు.ఈ సందర్భంగా శనివారం ఎన్‌జీ కళాశాల గణితశాస్త్ర విభాగాధ్యక్షులు ఎం. వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో అధ్యాపక బృందం వారికి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఈ శిక్షణ కార్యక్రమం జూన్ 8 నుంచి జూన్ 19 వరకు బెంగళూరులోని ఐసీటీఎస్ ప్రాంగణంలో జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ మధుకర్ రెడ్డి,కనకయ్య,మథిన్ హుస్సేన్,బాల కార్తీక్ పాల్గొన్నారు.

# ఆపన్న హస్తం కోసం ఎదురుచూపు

### క్యాన్సర్‌తో పోరాడుతున్న 12 ఏళ్ల చిన్నారి సాహితి



**ప్రజాపక్షం/వేములపల్లి:** మండలంలోని రావులపెంట గ్రామానికి చెందిన చిన్నారి సాహితి గత ఐదు సంవత్సరాలుగా క్యాన్సర్‌తో పోరాడుతూ ఆపన్న హస్తం కోసం ఎదురుచూస్తోంది.నిమ్స్‌లో చికిత్స పొందుతున్న చిన్నారిరావులపెంట గ్రామానికి చెందిన ఇంద్రపల్లి సైదులు కుమార్తె సాహితి వయసు 12 సంవత్సరాలు.ఐదేళ్లుగా క్యాన్సర్‌తో బాధపడుతూ హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. చికిత్సకు చాలా ఖర్చు అవుతుండటంతో ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న తండ్రి సైదులు తన కుమార్తె ప్రాణం కాపాడుకునేందుకు శతవిధాలా కృషి చేస్తున్నాడు. సహాయం అందించాలని వేడుకోలువేరే మార్గం లేక దాతల సహాయం కోసం ఎదురుచూస్తున్నాడు.సహృదయంతో ముందుకు వచ్చే దాతలు ఫోన్ పే, గూగుల్ పే,పేటీఎం సౌకర్యం గల 7095619363 నంబర్‌ను సంప్రదించాలని కోరుతున్నారు.

# సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో తీసుకెళ్లడమే లక్ష్యంగా...

### కలెక్టర్ తేజస్‌నంద్‌లాల పవార్



**ప్రజాపక్షం/కోదాడ:** ప్రజా పాలన, ప్రగతి ప్రణాళికలో వివిధ అభివృద్ధి సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో తీసుకెళ్లడమే లక్ష్యంగా అధికారులు కృషి చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్ లాల్ పవార్ తెలిపారు. శనివారం ప్రజా పాలన, ప్రగతి ప్రణాళికలో భాగంగా కోదాడ నియోజకవర్గ స్థాయి సమావేశంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా పాలనలో గ్రామస్థాయి నుండి జిల్లా స్థాయి వరకు శానిటేషన్, తాగునీరు, విద్య, వైద్యం లపై అధిక ప్రాధాన్యత కల్పిస్తుందని తెలిపారు. ప్రభుత్వ అదేశాలతో వేసవిలో తాగునీటి సమస్య లేకుండా ప్రణాళికలు చేశామన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో అమలు అవుతున్నాయా లేదా అని అధికారులు మానిటరింగ్ చేస్తూ అర్హులైన వారికి ప్రభుత్వ పథకాలు చేరేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రజల సమస్యలను గుర్తించి ఏ విధంగా పరిష్కారం చేయాలనేది కార్యచరణతో ముందుకు వెళ్లాలని సూచించారు. అభివృద్ధికి సంబంధించిన ఫైల్ పెండింగ్ పెట్టకుండా ఎప్పటికప్పుడు క్లియర్ చేయాలని అదేశించారు. గ్రామాలాభివృద్ధి కోసం గ్రామ సభలు నిర్వహించి ప్రజల నుండి వినతలు స్వీకరించాలని తెలిపారు. పిహెచ్‌సిలను బలోపేతం చేసే క్వాలిఫైడ్ డాక్టర్లు సిబ్బందితో గ్రామాలలో వైద్య సేవలను అందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వాసుపత్రిలో సాధారణ ప్రసవాలు పెంచేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఏరియా ఆసుపత్రిలో అప్‌గ్రేడ్ చేయడం జరిగిందని, ప్రస్తుతం పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. రానున్న రోజుల్లో జరగనున్న రైతు వారం, సంక్షేమ వారోత్సవాలు, చైల్డ్ సెఫ్టీ, నోడ్రగ్స్, వ్యవసాయం, యువజన సర్వీసులు, విద్య, మహిళలు, పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు ఉన్నాయని విజయవంతంగా నిర్వహించాలని తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ ఎర్నేని కుసుమ, వైస్ చైర్మన్ మల్లీశ్వరి, వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ ఏపూరి తిరపతమ్మ, డిపిఫ్‌వో సతీష్, ఆర్డీవో సూర్యానారాయణ, ఎస్సి డిడి దయానందరాణి, మున్సిపల్ కమిషనర్ రమాదేవి పాల్గొన్నారు.